సాక్షి జగిత్యాల

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023

I

రాజన్న పాహిమాం

వేములవాడ: రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తమతమ మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ దేవాలయాలను సందర్శించారు.



న్యూస్‌రీల్

శ్రీవేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం



వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను వివిధ రంగుల పూలతో చూడముచ్చటగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసచార్యులు మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీహవన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్సారెస్పీ గేట్లు మూసివేత



నిండుకుండలా ఎస్సారెస్పీ

జగిత్యాలఅగ్రికల్చర్: భారీ వర్షాలతో కొన్ని రోజుల పాటు తెరిచిన ఎస్సారెస్పీ గేట్లను శుక్రవారం మూసివేశారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 18,968 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో కాకతీయ మెయిన్ కెనాల్‌కు 3 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, వరద కాలువకు 15 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటి మట్టం 1091.00 అడుగులు కాగా, నీటి నిల్వలు 90.313 టీఎంసీలుగా ఉంది.

మోతె హెల్త్ సెంటర్ తనిఖీ



మాట్లాడుతున్న ప్రతినిధులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఎన్‌క్యూఏఎస్ ఎక్స్‌టర్నల్ అసెస్మెంట్ టీం తనిఖీ చేసింది. గర్భిణులు, చిన్నారులు, ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై అధికారులు వివరాలు సేకరించారు. రికార్డులు, మందుల నిల్వలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డాక్టర్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



నివాళి అర్పిస్తున్న ఇంజినీర్లు

జగిత్యాలజోన్: జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో శుక్రవారం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా విద్యుత్ శాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ, ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన ప్రతిభతో అనేక సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆదాయం రూ.15లక్షలు



సారంగాపూర్(జగిత్యాల): ప్రముఖ ఆలయం శ్రీదుబ్బరాజన్న ఆలయ హుండీ లెక్కింపును శుక్రవారం చేపట్టారు. ఈసందర్భంగా రూ.15,55,298 ఆదాయం సమకూరింది. 35.200 గ్రాముల బంగారం, 4.450 కిలోలు మిశ్రమ వెండి సమకూరింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఈవో అనూష, చైర్మన్ పొరండ్ల శంకరయ్య, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, ఎంపీపీ కోల జమున, సింగిల్‌విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వసతి కరువు

ఈ ఫొటోలో ఉంది ఇంటర్, డిగ్రీ చదువుతున్న బీసీ కమ్యూనిటీకి చెందిన విద్యార్థినులు. ఇతర గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి విద్యనభ్యసిస్తారు. రోజూ ఉదయం గ్రామాల నుంచి జిల్లా కేంద్రంలోని కళాశాలలకు రావడం, సాయంత్రం ఇంటికి వెళ్లడం ఇబ్బందిగా ఉందని, సరైన బస్సు సౌకర్యం లేదని, బీసీ హాస్టల్‌లో వసతి కల్పించాలని ఇటీవల కాలంలో పలుమార్లు ప్రజావాణిలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు తమ ఇబ్బందులను దరఖాస్తుల రూపంలో ఏకరువుపెట్టారు.



- విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యంలేక తీవ్ర ఇబ్బందులు
- రోజూ గ్రామాల నుంచి రాకపోకలతో అవస్థలు
- అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం
- ఏకైక బీసీ బాలికల హాస్టల్‌లో పరిమితికి మించి పాట్లు



జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహం

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో సరైన హాస్టల్ వసతి లేక బీసీ విద్యార్థినులు ఉన్నత విద్యకు దూరమవుతున్న దుస్థితి నెలకొంది. జగిత్యాల పట్టణంలో దాదాపు 20 కళాశాలలు ఉండగా వాటిలో చదువుతున్న ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు రోజూ సమీప గ్రామాల నుంచి బస్సుల్లో ప్రయాణించడం గగనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ వసతి లభించక పలు కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన వంద మందికి పైగా విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే విద్యార్థుల డిమాండ్‌కు అనుగుణంగా మరో బీసీ బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలంటూ అధికారులు పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలోనే ఉన్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో దాదాపు 2,000 మంది బీసీ విద్యార్థినులు చదువుకుంటుండగా సుమారు వెయ్యి మందివరకు హాస్టల్ వసతి కోసం దరఖాస్తు చేసి వెనుదిరుగుతున్నారని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పేద విద్యార్థినులను విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తున్నాయి.

పరిమితికి మించి.. ఎటూ సరిపోక..

జిల్లా కేంద్రంలో ఉన్న ఏకైక వసతిగృహంలో వంద మందికి మాత్రమే అవకాశం ఉంది. ఇందులో నిర్ణీత సంఖ్య కంటే ఎక్కువ మంది విద్యార్థినులను చేర్చుకోవడంతో సరైన సౌకర్యాలు అందక విద్యార్థినులు, మెనూ సర్దుబాటు చేయలేక వార్డెన్ సతమతమవుతున్నారని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. కేవలం వంద మందికి వసతి కల్పించేలా నెలకొల్పిన వసతి గృహంలో ఇప్పటికే 150కి పైగా విద్యార్థినులను చేర్చుకున్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల డిమాండ్‌కు అనుగుణంగా హాస్టల్ వసతి ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్న వసతిగృహాలు..

పోస్ట్‌మెట్రిక్ బాలికల బీసీ హాస్టల్ (ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థినులు)

		పోస్ట్ అండ్ ప్రీమెట్రిక్	
హాస్టల్‌లో అందుబాటులో ఉన్న సీట్లు	: 100	బాలికల ఎస్సీ హాస్టళ్లు	: 2
ఇప్పటికే హాస్టల్‌లో ఉంటున్నవారి సంఖ్య	: 150కి పైగా..	హాస్టల్ సామర్థ్యం	: 200
వసతి కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు(సుమారు)	: 500కుపైగా..	ఇప్పటికే భర్తీ అయిన విద్యార్థులు	: 250
		వసతి కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు(సుమారు)	: 500కుపైగా..

సమస్య పరిష్కరించాలి



జిల్లా కేంద్రంలో దాదాపు వెయ్యి మందికి పైగా బీసీ విద్యార్థినులు హాస్టల్ వసతి కోసం ఎదురుచూస్తున్నారు. పరిసర గ్రామాల నుంచి రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలి.

– రమ్యశ్రీ, బీఏ ఫైనలియర్, విద్యార్థి సంఘం ప్రతినిధి

కెపాసిటీకి మించి..



జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌లో కెపాసిటీకి మించి విద్యార్థులను అనుమతించారు. వసతులు కల్పించలేక వార్డెన్లు చేతులెత్తేస్తున్నారు. మరో హాస్టల్ ఏర్పాటు చేసి విద్యార్థినులకు అండగా నిలవాలి.

– అమూల్య, బీఏ ఫైనలియర్

ఇబ్బందిగా ఉంది



బుగ్గారం నుంచి సరైన బస్సు సౌకర్యం లేదు. రోజూ ఉదయం కాలేజీకి వచ్చి తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లే సరికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. జిల్లా కేంద్రంలో మరో హాస్టల్ ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుంది.

– గుడ్ల రమ్య, ఇంటర్, బుగ్గారం

అలసిపోతున్నం



రోజూ ఇంటికి వెళ్లి రావడంతో ప్రయాణంలో అలసిపోయి చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నా. నాలాంటి చాలా మంది విద్యార్థినులు ఇలాగే ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి హాస్టల్ వసతి కల్పించాలి.

– మాదాసు రమ్య, ఇంటర్, నేరెళ్ల

మరో హాస్టల్ ఏర్పాటు చేయాలి



బీసీ బాలికల కోసం జిల్లా కేంద్రంలో మరో హాస్టల్ ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలి. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలి.

– నరేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపించాం



పరిసర గ్రామాలు, మండలాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే విద్యార్థినుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని నూతనంగా మరో పోస్ట్‌మెట్రిక్ బీసీ విద్యార్థినుల హాస్టల్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా పరిశీలనలో ఉంది. ప్రభుత్వ అనుమతి రాగానే మరో హాస్టల్ ఏర్పాటు చేసి విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. – సాయిబాబా, బీసీ వెల్ఫేర్ అధికారి

పోలీసు విధులు సవాలే..



రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: పోలీసు విధులు సవాల్ లాంటివని ఎస్పీ భాస్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు శాఖ నుంచి మంజూరైన రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. పోలీసు శాఖ విధులు నిరంతరం ఉంటాయని, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటస్వామి, జానిమియా, రామకృష్ణ, ఆర్ఎస్సై వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

సీట్లు రావనే ఈడీ నోటీసులు



దావ వసంత

జగిత్యాలజోన్: దేశంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాదనే భయంతోనే ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు వచ్చేలా మోదీ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత విమర్శించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నించే మహిళలను వేధించి భయపెట్టడమే బీజేపీ ధర్మమా? అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి మోదీ చేతిలోని ఈడీ రాజ్యాంగ సంస్థనా.. బీజేపీ జేబు సంస్థనా? అని నిలదీశారు. లిక్కర్ స్కాంతో సంబంధం లేకున్నా.. మహిళ అని కూడా చూడకుండా ఎమ్మెల్సీ కవితను వేధించడం సరికాదని పేర్కొన్నారు.

జిల్లా ఐకాన్స్ ఎంపిక

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 18ఏళ్ల వయసు నిండిన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ మేరకు వివిధ రంగాల్లోని వారి భాగస్వామ్యంతో ఓటరు నమోదు కోసం ఐకాన్స్‌ను ఎంపిక చేశారు. యూట్యూబర్(గంగవ్వ టీం), శ్రీకాంత్, సరిత(పారా ఒలింపియన్), మర్రిపల్లి ప్రవీణ్(యోగా మాస్టర్), ఎస్.రాజేశ్వరి(యాంకర్), ఆర్.విరించి స్వప్నిక(వెయిట్‌లిఫ్టర్), దర్శిక(బాస్కెట్‌బాల్), బాలయ్య(సీనియర్ సిటిజన్), నిహారిక(ట్రాన్స్‌జెండర్) ఐకాన్స్‌గా ఎంపికయ్యారు. వీరు తమరంగాల్లో 18ఏళ్ల వయసు నిండిన వారిని ఓటరుగా జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని అవగాహన కల్పిస్తారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఐకాన్స్‌ను ఎంపిక చేశామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు.

టెట్ ప్రశాంతం

- పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్ యాస్మిన్‌బాషా
- నిమిషం ఆలస్యంగా వచ్చిన వారికి నో పర్మిషన్



హాల్‌టికెట్ నంబర్లు సరిచూసుకుంటున్న అభ్యర్థులు



నిరసన తెలుపుతున్న అభ్యర్థులు



మానస పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లా కేంద్రంలో శుక్రవారం చేపట్టిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పేపర్–1 పరీక్షకు 5,973 మందికి 4,867 మంది హాజరయ్యారు. 81.48 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన పేపర్–2కు 5,369 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 5,016 మంది హాజరయ్యారు. 93.43 శాతం హాజరు నమోదైంది. మానస స్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ యాస్మిన్ బాషా తనిఖీ చేశారు. టెట్ ప్రశాంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. ఒక నిమిషం ఆలస్యం నిబంధన కచ్చితంగా అమలు చేశారు. ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల వద్ద ఓ మహిళ రెండు నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు లోనికి అనుమతించలేదు. దీంతో ఆమె తిరిగి వెళ్లిపోయింది. పరీక్ష నిర్వహణ కోసం 300 మంది ఇన్విజిలేటర్లు, 25 చీఫ్ సూపరింటెండెంట్‌లు, 25 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 100 మంది హాల్ సూపరింటెండెంట్లు, ఆరుగురు రూట్ ఆఫీసర్లను నియమించారు. కాగా, అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

అభ్యర్థుల ఆందోళన

తక్కువ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పూనుకుంటుందని టెట్ అభ్యర్థులు పరీక్ష సెంటర్ల ముందు నిరసన వ్యక్తం చేశారు. 13,500 పోస్టులు డీఎస్సీ ద్వారా నియమించాల్సి ఉండగా, 5,083 తక్కువ పోస్టులు భర్తీచేసేలా చూస్తున్నారని ఆరోపించారు. కొత్తగా బదిలీలతో ఖాళీలు ఏర్పడుతున్నా.. ఆ పోస్టులను కూడా డీఎస్సీలో భర్తీ చేయాలని అభ్యర్థులు కోరారు.

ఓటుహక్కు కల్పించాల్సిన బాధ్యత అందరిది

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, అధికారులు

జగిత్యాల: ప్రజాస్వామంలో ఓటుహక్కు కల్పించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేసేందుకు అన్నివర్గాల సహకారంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఏటా జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని ఓటరు జాబితాలో చేర్చుతున్నామని చెప్పారు. 18 నుంచి 19 ఏళ్ల యువత జిల్లాలో 15 వేల మంది ఓటర్లుగా నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఈమేరకు వారిలో అవగాహన కల్పించేలా ప్రచారం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ, భారతదేశం ఎంతోగొప్పదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతీఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేశ్, డీపీఆర్వో భీంకుమార్ పాల్గొన్నారు.

'అది గులాబీబంధు'



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రావణి

జగిత్యాలటౌన్: బడుగులకు రాజ్యాధికారం బీఆర్ఎస్, కాంగ్రెస్ భిక్ష కాదని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం కల్పించిన హక్కు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కండ్లపెల్లికి చెందిన 25మంది యువకులు శుక్రవారం శ్రావణి నివాసంలో బీజేపీలో చేరారు. అనంతరం శ్రావణి మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత గెలిపించిన ఎమ్మెల్యేలే ఆమె వెనుక గోతులు తవ్వుతూ ఎంపీ ఎన్నికల్లో ఓటమికి కారణమయ్యారని ఎద్దేవా చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత నిర్వాకంతో రాష్ట్రంలో మహిళలు తలెత్తుకోలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరబత్తిని అనిల్‌కుమార్, ఆముద రాజు, నలువాల గంగాధర్, సాంబారి కళావతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు

- మహిళా కాంగ్రెస్ నేత విజయలక్ష్మి



జెండా ఆవిష్కరిస్తున్న విజయలక్ష్మి

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. స్థానిక ఇందిరాభవన్‌లో శుక్రవారం మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. తొలుత పార్టీ జెండా ఎగురవేసిన విజయలక్ష్మి.. మహిళా నాయకులతో కలిసి కేక్ కట్‌చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షల మేరకు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పాలనలోనే మహిళలకు రక్షణ ఉంటుందని అన్నారు. మద్యం అమ్మకాలను మూడింతలు పెంచిన సీఎం కేసీఆర్.. మహిళల మనోభావాలు దెబ్బతీశారని దుయ్యబట్టారు. మద్యం కోరల్లో చిక్కుకుని కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నా పట్టడం లేదని అన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణి మాట్లాడుతూ, కేసీఆర్ పాలనకు ముగింపు పలుకుతామన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు శోగ్రాభి, నాయకులు రాజేశ్వరి, సునీత, లావణ్య, మౌనిక, సాగరిక పాల్గొన్నారు.

స్ఫూర్తినిచ్చిన సాయుధ పోరు

- సీపీఐ పట్టణ కన్వీనర్ కోరుకంటి శ్రీనివాస్



నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: నిజాం నిరంకుశ, జమిందారీ, జాగిర్దారీ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ రైతాంగానికి స్ఫూర్తినిచ్చిందని సీపీఐ పట్టణ కన్వీనర్ కోరుకంటి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక టవర్ సర్కిల్‌లో జెండా ఎగురవేసి అమరులకు నివాళి అర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ సాయుధ పోరు ద్వారా భూస్వాములకు చెందిన 10 లక్షల ఎకరాలను సాగు చేశారని తెలిపారు. ఈ పోరాటంలో 4వేల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు అమరులయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గాదె దేవదాసు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ ముక్రం, నాయకులు వెన్న మహేశ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదల సంక్షేమమే ధ్యేయం



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పొలాసలో శుక్రవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఉపసర్పంచ్ ఎంపీ బకీ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిరొద్దీన్ మన్సూర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కాంగ్రెస్ పాలనలో చేపట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, మైనార్టీ నాయకులు సయ్యద్ ఆరీఫ్, ఎంఏ సాదిక్, ఎండీ సత్తర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితపై పోస్ట్ పెట్టిన వ్యక్తులపై ఫిర్యాదు

జగిత్యాల క్రైం: ఎమ్మెల్సీ కవితను వ్యక్తిగతంగా కించపరిచేలా ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టిన బీజేపీ కార్యకర్త వినోద్‌కుమార్ యాదవ్, అతని పోస్టులను షేర్ చేసిన భూమి రమణపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జగిత్యాల బీఆర్‌ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు గిరి, సోషల్ మీడియా అధ్యక్షుడు అలిశెట్టి వేణుగోపాల్ కోరారు. శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు శేఖర్, ఆరిఫ్, శరత్, రాజు, రాము, మహేశ్, హరీశ్ పాల్గొన్నారు.

అంజన్న దర్శనం.. వారికి ఉచితం

- టిక్కెట్లు తీయకుండానే ఆలయంలోకి బంధువులు, స్నేహితులు
- లడ్డూలు తీసుకెళ్తున్న వైనం
- పాలక మండలి సభ్యుల తీరుపై ఆరోపణలు
- అదనపు ఖర్చులు సైతం పెరిగాయని భక్తుల అసంతృప్తి



కొండగట్టు దేవస్థానం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయ నూతన పాలకమండలి నియామకం తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిదేళ్లకు జరిగింది. భక్తులకు సేవలందిస్తారనుకున్న సభ్యులు ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆలయంలో అదనపు ఖర్చులు సైతం పెరిగాయని భక్తుల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

పాలక మండలి సభ్యులు చేయాల్సినవి..

పాలక మండలి సభ్యులు నిత్యం భక్తులకు సౌకర్యాలు కల్పించాలి. రద్దీ రోజుల్లో వారు కూడా క్యూలైన్ల వద్ద ఉండి, సేవలందించాలి. ఆలయానికి కావాల్సిన అభివృద్ధి పనుల విషయమై ఆలోచన చేయాలి. మూడు నెలలకోసారి ఈవో సమక్షంలో సమావేశం నిర్వహించుకొని, చేపట్టాల్సిన పనులపై తీర్మానం చేసి, కమిషనర్‌కు పంపాలి. ఆలయ డబ్బు వృథా కాకుండా దాతల సహాయం తీసుకోవాలి. ఆలయ అధికారులు, అర్చకుల విధి నిర్వహణను పర్యవేక్షించాలి. చివరకు ఈవో నిర్లక్ష్యంగా ఉన్నా కమిషనర్‌కు తెలపాలి.

కొంతమంది వల్లే నష్టం

12-02-2022 రోజున మొదటిసారి, అలాగే 08-05-2023న అదే పాత పాలక మండలి 14 మంది సభ్యులు రెండోసారి ప్రమాణస్వీకారం చేశారు. మొదటి ఏడాదిలోనే వీరి వల్ల ఆలయానికి అదనపు ఖర్చులు పెరిగాయన్న అపకీర్తి మూటగట్టుకున్నారు. కనీసం రెండో ఏడాదిలోనైనా భక్తులకు కోసం పని చేస్తారనుకుంటే చేయలేకపోయారన్న విమర్శలున్నాయి. భక్తులకు ప్రశాంత దర్శనం కల్పించాల్సినవారే నిబంధనలు తుంగలో తొక్కి, టిక్కెట్లు తీయకుండానే ఉచితంగా తమ బంధువులను, స్నేహితులకు స్వామివారి దర్శన అవకాశం కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదే అదునుగా అటు అర్చకులు, ఇటు పాత్రికేయులు, అధికారులు, సిబ్బంది, హోంగార్డులు, అటెండర్లు, చిరుద్యోగులు నిత్యం టిక్కెట్లు తీయకుండానే రాచమర్యాదల మధ్య దర్శనాలు చేయించుకొని, వెళ్లుతున్నట్లు తెలిసింది. ఎవరిని పడితే వారిని ఇష్టానుసారం కండువాలు, శాలువాలతో సన్మానించడం, లడ్డూ తయారీ కేంద్రం నుంచి ఉచితంగా లడ్డూలు తీసుకెళ్లడం జరుగుతోంది. కొంతమంది పాలకమండలి సభ్యుల వల్లే ఇదంతా జరుగుతున్నట్లు భక్తులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకొని, ఆలయ అభివృద్ధి, భక్తుల కోసం పని చేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు (ఫైల్)

టిక్కెట్లు లేకుండా దర్శనమా?



భక్తులకు సేవలందించడం, ఆలయ అభివృద్ధి కోసమే పాలక మండలి ఉంది. టిక్కెట్లు లేకుండా దర్శన అవకాశం ఎలా కల్పిస్తారు? ఉచితంగా కండువాలు, శాలువాలు, లడ్డూలు ఎలా తీసుకెళ్తారు? భక్తుల సొమ్ము వృథా చేసే హక్కు ఎవరిచ్చారు? ఇప్పటికైనా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి.

– కె.రాజశేఖర్, భక్తుడు, నమలికొండ

భక్తులకు సేవలందిస్తున్నం



ఆలయానికి వచ్చే భక్తులకు సేవలందిస్తున్నాం. అలాగే పాలక మండలి సభ్యులు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశాం. భక్తులకు సౌకర్యాల విషయమై మా సభ్యులందరం త్వరలోనే సమావేశమై, నిర్ణయాలు తీసుకుంటాం.

– ఉప్పుల గంగాధర్, పాలక మండలి సభ్యుడు, కొండగట్టు ఆలయం

డీఆర్డీఏ అధికారులమంటూ బెదిరింపులు

గొల్లపల్లి: గోవిందుపల్లికి శుక్రవారం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. తాము డీఆర్డీఏ అధికారులమని పంచాయతీ కార్మికులను, మహిళా ఫీల్డ్ అసిస్టెంట్‌ను బెదిరింపులకు గురిచేశారు. అంతేకాకుండా నర్సరీలోకి ప్రవేశించి, పనులు సక్రమంగా లేవని, అవతవకలకు పాల్పడుతున్నారని అన్నారు. స్థానికులకు వారి కదలికలపై అనుమానం రావడంతో ఫొటోలు తీశారు. దీంతో మళ్లీ వస్తామంటూ వెళ్లిపోయారు. బాధితులు వెంటనే తమ అధికారులకు సమాచారం అందించారు. ఎంపీడీవో నవీన్‌కుమార్ అన్ని గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించి, అప్రమత్తం చేశారు. సదరు వ్యక్తులు మిగతా గ్రామాలకు వెళ్లలేదని, డబ్బులు వసూలు చేసినట్లు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఇకపై గుర్తు తెలియన వ్యక్తులు బెదింపులకు పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలని కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానికులు ఆ వ్యక్తుల ఫొటోలు తీశారని, వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గొడ్డలితో వ్యక్తిపై దాడి

మెట్‌పల్లిరూరల్: ఓ వ్యక్తి మరో వ్యక్తిపై గొడ్డలితో దాడి చేయగా బాధితుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మెట్‌పల్లి మండలంలోని ఆత్మనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆత్మనగర్‌కు చెందిన నర్ర సాయిలు, బొంత పోశయ్య మధ్య ఓ విషయంలో వివాదం నడుస్తోంది. శుక్రవారం మరోసారి గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన పోశయ్య గొడ్డలితో సాయిలుపై దాడి చేశాడు. అతని మెడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడిని తొలుత మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడినుంచి నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. సాయిలు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోశయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

17 నుంచి అంబేడ్కర్ నాటిక ప్రదర్శన

జగిత్యాల: జిల్లాలోని పలు మండలాల్లో ఈ నెల 17నుంచి అంబేడ్కర్ నాటిక ప్రదర్శించనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 17న కోరుట్ల మోడల్‌స్కూల్, 18న మెట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయం, 19న జగిత్యాల ఎస్సీ కమ్యూనిటీ హాల్, 20న ధర్మపురి షాదీఖానా, 22న బుగ్గారం కల్యాణి విద్యాలయం, 23న పెగడపల్లి హైస్కూల్, 24న బుగ్గారం కళావేదిక, 25న వెల్గటూర్‌లో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహ ప్రాంతం, 26న ఎండపల్లి జీపీ ఆవరణ, 27న రాజారాంపల్లి జీపీ ఆవరణలో నాటక ప్రదర్శన సాయంత్రం 6 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న లక్ష్మణ్‌కుమార్



జగిత్యాలలో నిరసన తెలుపుతున్న టీచర్లు, ఆయాలు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

బుగ్గారం: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుగ్గారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమ్మెకు శుక్రవారం సంఘీభావం తెలిపారు. రెండు, మూడు రోజుల్లో అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చకపోతే ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట వంటావార్పు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులకు రూ.లక్షల్లో జీతాలు పెంచిన ప్రభుత్వం అనేక సందర్భాల్లో ప్రభుత్వానికి చేదోడువాదోడుగా ఉంటున్న అంగన్‌వాడీలకు ఎందుకు పెంచడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అంగన్‌వాడీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చేవరకూ దీక్ష

మల్యాల: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేవరకూ దీక్ష కొనసాగిస్తామని అంగన్వాడీ టీచర్ల సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు రజిత అన్నారు. మల్యాల మండల కేంద్రంలో దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు రామాజీపేట ఆయా మృతికి శుక్రవారం మౌనం పాటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తోపాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శోభ, మధుమతి, భవాని, రాధ, మమత, గంగ, కవిత తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

జగిత్యాలటౌన్: ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కోరారు. నిరవధిక సమ్మె 5వ రోజు శుక్రవారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. చిన్నారులు, గర్భిణులు, తల్లులకు పోషకాహారం అందించడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమకు న్యాయం చేయాలన్నారు. సీపీఐ నాయకుడు వెన్న మహేశ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడి, వారి న్యాయమైన డిమాండ్లు వెంటనే నెరవేర్చాలన్నారు. ఏఐటీయూసీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముఖ్రం తదితరులు పాల్గొన్నారు.

రేపు విమోచన దినోత్సవం నిర్వహించాలి

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గడ్డం వివేక్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వివేక్

వెల్గటూర్: బీజేపీ పిలుపునిచ్చిన అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వివేక్ కోరారు. శుక్రవారం వెల్గటూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీజేపీ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో నిర్వహించాలని, 30న ధర్మపురి నియోజకవర్గంలో నిర్వహించనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ఎవరికి అవకాశం ఇచ్చినా నాయకులు, కార్యకర్తలందరూ కష్టపడి, విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గాజుల మల్లేశం, కొత్తపేట సర్పంచ్ కొమ్ము రాంబాబు, ఆరు మండలాల అధ్యక్షులు, వివిధ మోర్చాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బయటపడ్డ విభేదాలు

ముఖ్య కార్యకర్తల సమావేశంలో వివేక్ సాక్షిగా పార్టీ నాయకుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. కొందరు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలకు కార్యకర్తలెవరికీ సమాచారం ఇవ్వడం లేదని, నియోజకవర్గంలో బీజేపీ గ్రాఫ్ పడిపోతోందని, నియోజకవర్గానికి వివేక్ సమయం కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో పలువురు ఆధిపత్యం చలాయిస్తున్నారని, నాయకులందరినీ కలుపుకుపోవడం లేదని ఫిర్యాదు చేశారు. ధర్మపురి నుంచే పోటీ చేయాలని వివేక్‌ను కోరినా ఆయన ఎటూ తేల్చకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ భిక్షాటన చేసే వ్యక్తి మృతి



జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద భిక్షాటన చేస్తూ జీవించే వ్యక్తి ఈ నెల 9న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే పోలీసులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి బంధువులు, తెలిసినవారు ఎవరైనా గుర్తిస్తే జగిత్యాల పట్టణ సీఐ 79898 94832 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేషన్ బియ్యం సక్రమంగా అందించండి



రేషన్ దుకాణం వద్ద డీటీసీఎస్ వరప్రసాద్

జగిత్యాలక్రైం: రేషన్ దుకాణాల్లో వినియోగదారులకు బియ్యం సక్రమంగా అందించాలని డీటీసీఎస్ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని గంజ్‌రోడ్‌లో గల ఓ రేషన్ దుకాణంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. 17 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం రావడంతో డీలర్ రాణిపై 6ఏ కేసు నమోదు చేశారు. ఆ దుకాణంలోని బియ్యాన్ని సమీపంలో ఉన్న డీలర్ ప్రశాంత్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా డీటీసీఎస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల వేలిముద్రలు సేకరించి, అందజేయాలని, దుకాణంలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ప్రతీ వినియోగదారుకు బియ్యం పంపిణీ చేయాల్సిన బాధ్యత డీలర్లపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు మహేశ్వర్‌రావు, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2005-06 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ వేడుకకు స్థానిక ఓ ఫంక్షన్‌హాల్ వేదికైంది. 18 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులను కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తరగతి గది జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు. రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా నియామకమైన తమ సహచరుడు కనుక సంజీవ్‌ను సన్మానించారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ గ్రామంలో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై శుక్రవారం స్కూల్ బస్సు ఢీకొన్న ఘటనలో జగిత్యాలకు చెందిన శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాంత్ బైక్ వెళ్తూ తన ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయగా ఎదురుగా వస్తున్న పాఠశాల బస్సు ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. అతన్ని వెంటనే 108 వాహనంలో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

దుబ్బరాజన్న ఆలయానికి రూ.5 లక్షల విరాళం



ఈవోకు చెక్కు అందిస్తున్న అజయ్

సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయానికి బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అజయ్–అనీల దంపతులు శుక్రవారం రూ.5 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఆలయ కోనేరు వద్ద భక్తుల విశ్రాంతి గదుల నిర్మాణానికి ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు వారిని సన్మానించి, స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శేఖర్, ఈవో అనూష, చైర్మన్ శంకరయ్య, అర్చకులు చంద్రశేఖరశర్మ, సాగర్, భక్తులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలంలోని సంగంపల్లి గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. సంగంపల్లికి చెందిన అంకతి శ్రీకాంత్ కుటుంబసభ్యులు శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి, ఇంటి వెనకాల ఉన్న వ్యవసాయ పొలంలో పని చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి, లోపలికి చొరబడ్డారు. 5 తులాల బంగారం, 14 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధిత కుటుంబసభ్యులు వ్యవసాయ పనులు ముగించుకొని, ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి, చోరీకి జరిగినట్లు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సదాకర్ సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. ఫింగర్ ప్రింట్స్ సిబ్బంది ఆధారాలు సేకరించారు.

మృత్యువుతో పోరాడి ఓడిన అముద

క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి


అముద (ఫైల్)

కోదాడ: క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న అముద అనే అభాగ్యురాలు చివరకు ఓడిపోయింది. ఆరు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. తమిళనాడులో పుట్టి పెరిగిన అముద నారాయణ నాడార్(40) మతిస్థిమితం కోల్పోయి 15 ఏళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడకు చేరుకుంది. మున్సిపాలిటీ చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటుండగా పల్లా వెంకటేశ్వర్లు అనే స్థానికుడి కంటపడింది. ఆమెను వెంకటేశ్వర్లు చేరదీసి ఆదరించాడు. దాతలు, మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామిరెడ్డి సాయంతో మంచిమనిషిగా మార్చాడు. కొంతకాలం విద్యావలంటీర్‌గా పనిచేసింది. కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఆరునెలల క్రితం ఆమె అనారోగ్యం బారిన పడింది. వైద్యులు పరీక్షించి క్యాన్సర్ అని తేల్చారు. వెంకటేశ్వర్లు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ శుక్రవారం కోదాడలోని వెంకటేశ్వర్లు ఇంట్లోనే కన్నుమూసింది.

అడుగడుగునా అండగా నిలిచిన ‘సాక్షి’

చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను వెంకటేశ్వర్లు ఆదరించిన వైనాన్ని, ఆ తర్వాత మంచిమనిషిగా మారిన అముద గురించి పలు సందర్భాల్లో ‘సాక్షి’కథనాలు ప్రచురించింది. అముద జీవిత చరిత్రను టెలిఫిల్మ్‌గా తీసిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. అముదకు క్యాన్సర్ సోకిన విషయాన్ని ‘అయ్యో అముద’శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు ముందుకొచ్చి సాయం కూడా అందించారు.

మూడు ‘రియల్’ సంస్థలకు రూ. 50 లక్షల జరిమానా

సాక్షి, హైదరాబాద్: జయత్రి(జయ గ్రూపు) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఏపీఎల్ సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడమేకాక, మార్కెటింగ్ నిర్వహించడంపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కన్నెర్ర చేసింది. ఈ సంస్థలపై రూ. 50 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం రెరా చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.


ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏజెన్సీకి వైద్యాధికారులు

‘సాక్షి’ కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఏజెన్సీలో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం ‘సాక్షి’ ప్రధాన సంచికలో ‘ఏజెన్సీకి ఫీవర్’ శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలకేంద్రంతోపాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెంలో వైద్యశిబిరం నిర్వహించి 100మందికి మందుల కిట్ అందజేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ అప్పయ్య సందర్శించి రోగులను పరీక్షించారు. తాడ్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేడారం, గంగారం గ్రామాల్లో, కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మంగపేట మండలంలోని నర్సింహసాగర్, అకినేపల్లిమల్లారంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

అజ్ఞాతం వీడండి

- మావోయిస్టులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు
- కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావు అరెస్టు


మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో సంజోయ్ దీపక్‌రావు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణకు చెందిన అగ్రనేతలు, కేడర్ అజ్ఞాతం వీడి పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ అంజనీకుమార్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావును శుక్రవారం ఉదయం కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో అరెస్టు చేసినట్టు డీజీపీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన దీపక్‌రావు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఓ మావోయిస్టు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, ఆయన కదలికలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒక రివాల్వర్, ఆరు లైవ్‌రౌండ్లు(బుల్లెట్లు), రూ.47,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో ఉండే మహేంద్రటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంజిత్‌శంకరన్, మాదాపూర్‌కు చెందిన ఓ సినీ దర్శకుడు బి.అజిత్‌కుమార్‌లు దీపక్‌రావుకు ఆశ్రయం ఇచ్చినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా తెలంగాణ నుంచి మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా శూన్యమని, సంజోయ్ దీపక్‌రావు అరెస్టుతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యిందన్నారు. దీపక్‌రావు మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బస్వరాజ్, కోసాలతో నేరుగా సంబంధాలున్నట్టు తెలిపారు.

నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్

సంజోయ్ దీపక్‌రావు ప్రస్తుతం కేంద్ర కమిటీతోపాటు సౌత్ రీజియన్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా, వెస్ట్రన్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న ఆయన మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పోలీసులతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. దీపక్‌రావుపై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంధనగర్‌కు చెందిన సంజయ్ దీపక్‌రావు జమ్మూకశ్మీర్‌లో 1984లో బీటెక్ పూర్తి చేశారు. 1999లో సీపీఐఎంఎల్ రవూఫ్ గ్రూప్‌లో తొలుత చేరారు. నక్సల్‌బరీ గ్రూప్‌నకు మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2000లో ఓసారి అరెస్టు, తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2002లో అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాల వ్యాప్తికి కీలకంగా పనిచేశారు. 2014లో నక్సల్‌బరీ, సీపీఐ మావోయిస్టులో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 2021లో పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి బీజీ కృష్ణమూర్తి అరెస్టు తర్వాత, ఆ జోనల్‌కు ప్రత్యేక జోనల్ కమిటీకి కార్యదర్శిగా నియామకం కాగా, అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు.

మంత్రాల నెపంతో ఇద్దరిపై దాడి


బానోత్ నరేశ్, భాస్కర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

నర్సాపూర్‌రూరల్: మంత్రాల నెపంతో ఇద్దరిని చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ మండలం పాప్యా తండాకు చెందిన బానోత్ లావణ్యకు జ్వరం రావడంతో ఈ నెల 14న నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మెదక్ మండలం సంగాయిగుడి తండాకు చెందిన బంధువులు నేనావత్ భాస్కర్, మూడవత్ భాస్కర్ అదేరోజు సాయంత్రం వచ్చి లావణ్య, ఆమె భర్త నరేశ్‌ను పరామర్శించారు. ఈ క్రమంలో వైద్యులు ఆమెను రాత్రి డిశ్చార్జి చేయడంతో అందరూ కలిసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం బయటికి వచ్చిన భాస్కర్‌ను స్థానికులైన రమావత్ సక్రు, రమావత్ మోహన్ అనుమానించి చెట్టుకు కట్టేసి చితకబాదారు. అరుపులు విని నరేశ్ బయటకు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి తీసుకెళ్లాడు. శుక్రవారం ఉదయం మళ్లీ స్థానికులు నరేశ్ ఇంటికి చేరుకున్నారు. తమ ఇంటి చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉన్నాయంటూ భాస్కర్, నరేశ్‌లను చెట్టుకు కట్టేసి కట్టెలు, రాళ్లతో కొట్టారు. ఈ ఘటనపై బాధితుడి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సునీతను టైరు సహాయంతో వాగు దాటిస్తున్న గజ ఈతగాళ్లు

టైరును తెప్పలా చేసి.. గర్భిణిని వాగు దాటించి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి వద్ద ఏటా వర్షాకాలంలో జంపన్నవాగు ప్రవాహంతో బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎలిశెట్టిపల్లికి చెందిన దబ్బకట్ల సునీత ఏడు నెలల గర్భిణి. ఆమెకు శుక్రవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడే ఉన్న కొందరు గజ ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో ట్రాక్టర్ వెనుక టైరును తెప్పలా మార్చారు. దానిపై గర్భిణిని కూర్చోబెట్టి వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి సాధారణమైన నొప్పులేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలిక బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల్లో కొత్త కొలువులు!

- మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 3,989 హెల్పర్ పోస్టులకు చాన్స్
- కసరత్తు చేస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ

సాక్షి, హైదరాబాద్: మినీకేంద్రాల స్థాయి పెంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీకేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటారు. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టొచ్చు.

టీచర్ల భర్తీ తర్వాతే...

రాష్ట్రవ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీతో దాదాపు రెండున్నర వేలమంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఈక్రమంలో అన్ని రకాల్లో కలిపి నాలుగువేల వరకు పోస్టులు ఖాళీగా ఉంటాయి. అయితే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, అంతకుముందే అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా ఖాళీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా సంక్షేమాధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

విద్యతోనే సామాజిక న్యాయం

- సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి
- యూనివర్సిటీ సినిమా ప్రమోషన్‌లో భాగంగా నస్పూర్‌కు రాక


నారాయణమూర్తిని సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: విద్యతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్. నారాయణమూర్తి అన్నారు. మంచిర్యాల జిల్లా సింగరేణి శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం నారాయణమూర్తిని సన్మానించారు. అనంతరం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన యూనివర్సిటీ సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో నారాయణమూర్తి మాట్లాడారు. తాను నటించి, నిర్మించి, దర్శకత్వం, సంగీతం వహించిన యూనివర్సిటీ సినిమా అక్టోబర్ 13న విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా నస్పూర్‌కు వచ్చానని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన, జరుగుతున్న పరీక్షల పేపర్ లీకేజీ ఇతివృత్తంగా యూనివర్సిటీ సినిమా రూపొందించామని చెప్పారు. విద్యారంగంలో పేపర్ లీకేజీ అనేది భారత దేశంలో పెను ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని తెలంగాణ, ఏపీ, గుజరాత్, అసోం, ఎంపీ, బీహార్, యూపీ రాష్ట్రాలలో పేపర్ లీకేజీలు జరిగాయని వివరించారు. విద్యా వ్యవస్థ చిన్నాభిన్నం అయితే మొత్తం వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందన్నారు. పేపర్ లీకేజీలను అరికట్టాల్సిన బాధ్యత స్వయం ప్రతిపత్తి కలిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై ఉందని తెలిపారు. విద్య జాతీయ సంపద అని దానిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. సినిమా బాగుంటే చిన్న సినిమా పెద్ద సినిమా అని తేడా లేకుండా ప్రేక్షకులు ఆదరిస్తారని, దానికి ఉదాహరణ బేబీ సినిమానే అని అన్నారు. జీతం జీవితం రెండూ ఇంగ్లిష్ బాషపైనే ఆధార పడి ఉన్నాయని, నేటి సమాజంలో ఇంగ్లిష్ భాష ప్రాముఖ్యతను ఈ సినిమాలో బలంగా చూపించామని తెలిపారు. పండుగల సెలవులు, పబ్లిక్ హాలిడేస్‌లో థియేటర్లలో చిన్న సినిమాల ప్రదర్శనకు ఉదయం ఆటను చిన్న సినిమాలకు కేటాయించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరామని తెలిపారు. నా సినిమా ప్రదర్శనకు సహకరించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. తన సినిమాకు ప్రజాయుద్ధనౌక గద్దర్‌తోపాటు తెలంగాణ కళాకారులు పాటలు అందించారని వెల్లడించారు. యూనివర్సిటీ సినిమాను ఆదరించాలని కోరారు.

ఎన్నికల బరిలో ఉంటా.. ఆశీర్వదించండి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


కన్నీరు పెట్టుకుంటున్న ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నుంచే తాను బరిలో ఉంటానని ఎమ్మెల్యే రేఖానాయక్ స్పష్టం చేశారు. మీ ఆశీస్సులు కావాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. చింతగూడ లక్ష్మీదేవి ఆలయంలో పూజలు చేశారు. అక్కడే ఓ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక మహిళలతో ఆప్యాయంగా మాట్లాడారు. రెండుసార్లు ఆశీర్వదించినట్లుగానే వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. 12 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన తనకు ఈసారి టికెట్ ఇవ్వలేదని కన్నీరు పెట్టుకున్నారు. దీంతో స్థానిక మహిళలు ఎమ్మెల్యేను ఓదార్చారు. తర్వాత ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సీపతి రామ్మూర్తి కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచి జన్నారం గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. మంజూరైన అభివృద్ధి పనులు నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు జరిగితే తనకు పేరు వస్తుందని ఆరు నెలలుగా కొంతమంది పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాను ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని తెలిపారు. అనంతరం చింతలపల్లి గ్రామానికి వెళ్లి ప్రజలతో కలిసి మాట్లాడారు. అక్కడ గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట జన్నారం సర్పంచ్ గంగాధర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సతీశ్‌కుమార్, కాంతమణి తదితరులు ఉన్నారు.

నృత్యకారులకు సన్మానం..

జిల్లా నృత్య కళాసమాఖ్య ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు గాజుల సహస్రగౌడ్, శ్రేణు, సంకర్ష్, వర్షిణి, తన్విక, అశ్విత, మోక్షితలను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమానికి రేఖానాయక్ హాజరైన మాట్లాడారు. జాతీయస్థాయి నృత్య పోటీలకు రాష్ట్రం నుంచి 18 మంది ఎంపిక కాగా, అందులో 8 మంది జన్నారం మండలానికి చెందినవారే కావడం గర్వకారణమన్నారు. చిన్నారుల్లోని కళలను వెలికితీసి, వారి ప్రతిభ జాతీయ స్థాయిలో చూపిస్తున్న మాస్టర్లను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నృత్య కళాసమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్, డ్యాన్స్ మాస్టర్లు లక్ష్మణ్, రమేశ్, నర్మదగౌడ్, నాయకులు సతీశ్‌కుమార్, కాంతామణి పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి


కార్యక్రమంలో వీసీ, డైరెక్టర్, కంపెనీల ప్రతినిధులు

భైంసా: విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలని ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ అన్నారు. శుక్రవారం వర్సిటీలో కాకతీయ శాండ్‌బాక్స్, దేశ్‌పాండే ఫౌండేషన్, గ్రాడ్ క్యాపిటల్ వ్యవస్థాపకులతో వ్యవస్థాపక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్‌పై ‘యువ’ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజిరెడ్డి, కాకతీయ శాండ్‌బాక్స్ సీఈవో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల కోసం ‘వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ’లో మూడు నెలల నాన్ క్రెడిట్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉన్నట్లుగానే ప్రతీ పనికి ఒక నూతన ఆవిష్కరణలు చేయడానికి విద్యార్థులు సాంకేతికంగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్ ఎట్ ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో రాకేశ్‌రెడ్డి కోఆర్డినేటర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ఇంజినీర్స్ డే..

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం ఇంజినీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ సతీశ్‌కుమార్, వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మోక్షగుండంవిశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ శాంతి జగదీశ్వరి, అధ్యాపకులు కలీల్, వహీద్, వినోద్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్సీ ‘అగ్రి’ ప్రవేశాలు షురూ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాకు కొత్తగా మంజూరైన బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 11 నుంచి తొలివిడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఏడుగురు విద్యార్థులు ఆదిలాబాద్ కళాశాలలో సీట్లు పొందినట్లుగా కళాశాల అసోసియేట్ డీన్ శ్రీధర్‌చౌహాన్ తెలిపారు. శనివారంతో తొలివిడత ముగియనుండగా మరికొంత మంది ప్రవేశాలు పొందే అవకాశముందని పేర్కొన్నారు. రాంనగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో గల కృషి విజ్ఞాన కేంద్రం భవనాల్లో ప్రారంభించనున్న ఈ కళాశాలకు ప్రభుత్వం 60 సీట్లు కేటాయించిన విషయం తెలిసిందే. పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కాని పక్షంలో రెండు, మూడో విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని డీన్ పేర్కొన్నారు.

అధికారులు వర్సెస్ కార్మికులు

- దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల్లో ఆందోళన
- సీఎంవోఏఐ కోర్టుకెక్కడంతో కార్మిక సంఘాల ఆగ్రహం
- అధికారుల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు
- సమ్మెకు పిలుపునిచ్చిన జాతీయ కార్మిక సంఘాలు


సింగరేణి కార్మికులు

గోదావరిఖని: కార్మికుల వేతనాలపై కోలిండియా అధికారుల సంఘం కోర్టుకెక్కడం కార్మికులకు ఆగ్రహం తెప్పిస్తోంది. మా జీతాలు పెరిగితే వాళ్లకేమి కళ్లమంట అంటూ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఈక్రమంలో అధికారుల సంఘం వర్సెస్ కార్మిక సంఘంగా మారుతోంది. విభేదాలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు రోజుల సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. 11వ వేతన ఒప్పందం అమలు కావడంతో కోలిండియా వ్యాప్తంగా ఉన్న సింగరేణి, బీసీసీఎల్, ఎన్‌సీఎల్, మహానది కోల్‌ఫీల్డ్స్, ఎస్ఈసీఎల్, డబ్ల్యుసీఎల్, ఈసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న మూడున్నర లక్షల మందికి పెరిగిన వేతనాలు అమలువుతున్నాయి. ఈసమయంతో అధికారుల సంఘం కోర్టుకెక్కడం కార్మిక సంఘాలకు ఆగ్రహం తెప్పిస్తోంది. తమకు వేతనాలు పెరగాలని పోరాడాలే తప్ప కార్మికుల వేతనాలు ఎందుకు పెరిగాయని వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నాయి. అధికారుల వేతన ఒప్పందం పదేళ్లకోసారి, కార్మికుల వేతన ఒప్పందం ఐదేళ్లకోసారి జరుగుతుంది. ఈసమయంలో వేతనాల పెరుగుదల అవకాశం ఉంటుంది. ఈక్రమంలో రెండు నెలల కిందట జరిగిన వేతన ఒప్పందంలో కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఈ–4 నుండి కింది స్థాయి అధికారులకన్నా కార్మికుల వేతనాలు ఎక్కువగా ఉండే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. అయితే పదేళ్లకోసారి మాత్రమే పెంచేందుకు అవకాశం ఉండటంతో చేసేదేమి లేక కార్మికుల వేతనాలను ఎక్కువగా ఉన్నాయని అధికారులు కోర్టుకెక్కడం హాస్యాస్పదం అంటున్నారు.

వేతనాలపై ప్రభావం చూపితే ఊరుకోం..

తాము యాజమాన్యంతో పోరాడి 11వ, వేతన ఒప్పందం సాధించుకున్నామన్నారు. ఈక్రమంలో అధికారుల సంఘం కోర్టుకెక్కడంతో కార్మికుల వేతనాలు నిలిచిపోతే ఊరుకునేది లేదని కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. అధికారులు పోరాడి వేతనాలు పెంచుకోవాలే తప్ప కార్మిక వేతనాలపై కోర్టుకెక్కడం సరికాదంటున్నారు. ఈక్రమంలో కార్మికుల వేతనాలపై ప్రభావం చూపితే అధికారులపై తిరుగుబాటు తప్పదని హెచ్చరిస్తున్నారు.

వచ్చేనెల 5,6,7 తేదీల్లో సమ్మె

అధికారుల తీరును నిరసిస్తూ కోలిండియా వ్యాప్తంగా వచ్చేనెల 5,6,7 తేదీల్లో సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, సీఐటీయూ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈమేరకు కోలిండియా స్థాయిలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రకటించాయి. తాము పోరాడి సాధించుకున్న వేతనాలపై ప్రభావం చూపితే అధికారుల అంతుచూస్తామని హెచ్చరిస్తున్నాయి. ఈవిషయంలో అధికారులు పునరాలోచించుకుని ఇన్నేళ్ల పాటు అధికారులు, కార్మికుల మధ్య ఉన్న సత్సంబంధాలు కొనసాగించాలంటున్నారు.

ఇక అధికారులపై పోరాటమే..



కార్మికుల వేతనాలపై కోలిండియా అధికారుల సంఘం(సీఎంఓఏఐ) జబల్‌పూర్ హైకోర్టులో పిటిషన్ వేసింది. రెండు నెలలుగా 11వ వేతన ఒప్పందం ప్రకారం కార్మికుల జీతాలు పెరిగాయి. ఈక్రమంలో అధికారులు కోర్టుకెక్కడం వల్ల కార్మికుల పెరిగిన జీతాలు ఆగితే ఊరుకోం. ఇంత ఎంత మాత్రం సమంజసం కాదు.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షులు

సమ్మెను విజయవంతం చేయాలి



కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇదే వైఖరితో ముందుకు సాగితే ఇరువురి మధ్య అంతరం పెరుగుతుంది. ఇన్నేళ్ల పాటు కొనసాగిన సత్సంబంధాలు దెబ్బతింటాయి. అధికారులు వేతనాలు పెంచుకుంటే తమకేమి ఇబ్బంది కాబోదు. పెరిగిన వేతనాలు ఆగితే ఊరుకోబోం.

– యాదగిరి సత్తయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు

మావోయిస్టులపై ప్రత్యేక నిఘా

- భూపాలపల్లిలో అంతర్ రాష్ట్ర పోలీసుల సమావేశం
- దిశా నిర్దేశం చేసిన సీపీ రెమా రాజేశ్వరి


సమావేశంలో సీపీ రెమా రాజేశ్వరి, ఎస్పీలు

గోదావరిఖని: రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర పోలీసు అధికారులు నిర్ణయించారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జెన్‌కో కాన్ఫరెన్స్ హాల్‌లో భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్లా కరుణాకర్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి చర్చించారు. మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సంబంధిత సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని నిర్ణయించారు. ఫలితంగా మావోయిస్టులను కట్టడి చేయడం సులభతరమవుతుందన్నారు. దీని ద్వారా ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించవచ్చని తెలిపారు. రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయటంతో పాటు మద్యం, డబ్బు ఇతర ఇల్లీగల్‌కు సంబంధించి అక్రమ రవాణా అడ్డుకట్ట పడుతుందన్నారు. సరిహద్దు గుండా అక్రమ మద్యం, మహారాష్ట్ర దేశీదారు, గంజాయి మొదలైన వాటి రవాణా నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ములుగు ఎస్పీ గౌస్ ఆలం, కొమురంభీం ఆసిఫాబాద్ ఎస్పీ కె.సురేశ్‌కుమార్, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్, మంచిర్యాల్ డీసీపీ సుధీర్‌కేకెన్, ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్, ఇతర రాష్ట్రాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.